నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 3 మే 2025 | NIZAMABAD

- గతంలో మాట నిలబెట్టుకోలేదన్న తుమ్మల
- ఏప్రిల్‌లోపే ఇస్తామన్న వ్యవసాయ శాఖ మంత్రి
- రైతు మహోత్సవంలో ఘనంగా ప్రకటన
- నెల దాటినా ఇంకా అందని పెట్టుబడి సాయం
- గడువుల మీద గడువులు పొడిగింపు
- మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్న వానాకాలం
- ఉమ్మడి జిల్లాలో లక్షలాది మందికి దక్కని 'భరోసా'

# మాటలే.. పైసల్లేవ్!

రైతుభరోసాపై సర్కారు పిల్లిమొగ్గలు

నిజామాబాద్ మే 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతోనే కాలం వెళ్లదీస్తున్నది. పథకాల అమలులో పూటకో గడువు చెబు తూ రోజులు గడుపుతున్నది. రైతు భరోసా విషయంలో రేవంత్ సర్కారు మరోసారి మాట తప్పింది. ఏప్రిల్ నెలాఖరులోగా పెట్టుబడి సాయం పూర్తి చేస్తామంటూ నిజామాబాద్ వేదికగా ఏప్రిల్ 21న రైతు మహోత్సవం ప్రారంభోత్సవంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన ప్రకటనకు కూడా దిక్కు లేకుండా పోయింది. గతంలో చెప్పిన సమయానికి పెట్టుబడి సాయం అందించలేక పోయమని రైతులకు క్షమాపణలు చెప్పిన మంత్రి.. నెలాఖరులోగా డబ్బులు వేస్తామని ప్రకటించారు. కానీ మే నెల ప్రారంభమైనా పైసలు పడలేదు. దీంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ వాళ్లు చెప్పేది సొల్లు పురాణమే తప్ప చేసేదేమీ లేదని ఎద్దేవా చేస్తున్నారు.

## లెక్కాపత్రం లేదు..

గతంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మొత్తం 10.48 లక్షల ఎకరాలకు రైతుబంధు పథకం వర్తించింది. ప్రస్తుతం గుట్టలు, పడావు భూములను తీసేస్తే సుమారుగా 10 లక్షల ఎకరాలకు రైతుభరోసా చెల్లించాల్సి ఉంది. యాసంగిలో ఎకరాకు రూ.6 వేల చొప్పున ఇస్తే రూ.600 కోట్లు రైతుల ఖాతాల్లో వేయాలి. కానీ ఇప్పటిదాకా కేవలం రూ.250 కోట్లు లోపే జమ చేసినట్లుగా తెలిసింది. మిగతా వారికి ఎప్పుడు వేస్తారో.. అసలు వేస్తారో లేదో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.


## కేసీఆర్ హయాంలో ఠంచన్‌గా..

కేసీఆర్ హయాంలో పంట సీజన్ ప్రారంభానికి పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో జమ అయ్యేది. 11 విడుతలుగా అమలైన రైతుబంధు పథకంలో ఎప్పుడూ జాప్యం జరుగలేదు. కరోనా కష్ట కాలంలోనూ కేసీఆర్ రైతులకు సాయం నిలిపి వేయలేదు. కానీ కాంగ్రెస్ వచ్చాక రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందర హామీ ఇచ్చింది. రైతు డిక్లరేషన్ పేరిట నమ్మించి ఓట్లు వేయించుకున్నది. తీరా అధికారంలోకి వచ్చాక రూ.15 వేల పెట్టుబడి సాయాన్ని రూ.12వేలకు తగ్గించింది. అదయినా అందరికీ వేశారా అదీ లేదు. తొలి రెండు సీజన్లు రైతుభరోసాను ఎగ్గొట్టిన రేవంత్ ప్రభుత్వం.. మొన్నటి యాసంగిలో రైతుభరోసా ఇస్తున్నామంటూ గప్పాలు కొట్టింది. కొంత మందికి మాత్రమే రూ.6 వేల చొప్పున ఖాతాల్లో జమ చేసింది. సగానికంటే ఎక్కువ మంది అర్హులైన రైతులకు ఇప్పటికీ పెట్టుబడి సాయం అందలేదు. ఇదేందని అడిగితే సమాధానం ఇచ్చే దిక్కులేకుండా పోయింది. వ్యవసాయ శాఖ వద్ద అధికారిక సమాచారం లేదంటూ అధికారులు బుకాయిస్తున్నారు. ఎంత మందికి సాయం అందింది? ఇంకా ఎంత మందికి సాయం అందాల్సి ఉందని ప్రశ్నిస్తే వ్యవసాయాధికారులు సమాధానం ఇచ్చేందుకు జంకుతున్నారు.

> 'రైతన్నలారా మన్నించండి... అనుకున్న సమయానికి రైతు భరోసా వేయలేక పోయాం. కానీ ఈ నెలాఖరులోగా మిగిలిన వారందరికీ రైతు భరోసా వేస్తాం'
>
> –ఏప్రిల్ 21న రైతు మహోత్సవంలో మంత్రి తుమ్మల ప్రకటన

## లక్షలాది మంది ఎదురు చూపులు..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో లక్షలాది మందికి ఇప్పటికీ రైతుభరోసా అందలేదు. 4 ఎకరాల్లోపు రైతులకు డబ్బులు జమ చేసినట్లు వ్యవసాయ శాఖ చెబుతున్నది. అందులోనూ సగం మందికి మాత్రమే పెట్టుబడి సాయం నగదు జమ కాగా, చాలా మందికి అందలేదు. ఇదేమని అడిగితే సమాధానం చెప్పే వారు లేరు. యాసంగి మొదలైన నాటి నుంచి నేటి వరకు నెలల తరబడి వేయి కళ్లతో ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిలింది. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాటలు విన్న రైతులంతా పెట్టుబడి సాయం డబ్బులు జమ అవుతాయని ఆశగా ఎదురు చూశారు. వారందరికీ నిరాశే ఎదురైంది.



## సగం మందికి ధోకా..

రైతుభరోసా పథకం అమలు ఏమో కానీ వ్యవసాయ శాఖ అధికారులకు తలపోటుగా మారింది. జిల్లా వ్యవసాయాధికారి నుంచి మొదలు పెడితే వ్యవసాయ విస్తరణాధికారుల దాకా రైతులు అడిగే ప్రశ్నలకు జవాబివ్వలేక సతమతమవుతున్నారు. నాలుగు ఎకరాల్లోపు వారికి పెట్టుబడి సాయం వేశామని చెబుతున్నప్పటికీ, చాలా మందికి అది అందలేదు. అర ఎకరం, ఎకరం ఆపైన భూములున్న సన్న, చిన్నకారు రైతుల్లో భరోసా దక్కలేదు. కొంత మందికి పట్టాదారు పాస్‌బుక్కులో ఉన్న విస్తీర్ణానికి భిన్నంగా తక్కువ నగదును జమ చేశారు. ఏఈవోలు, ఏవోలకు ప్రభుత్వం సీయూజీ ఫోన్ నంబర్లు అందించింది. గతంలో ఉన్న నెట్‌వర్క్‌ను మార్చడంతో నంబర్లు మారిపోవడంతో ఏఈవోలు, ఏవోలకు భారీ ఊరట దక్కింది. వారి ఫోన్ నంబర్లు అందుబాటులో లేకపోవడంతో సామాన్య రైతులకు నేరుగా రైతు వేదికలకు పరుగులు తీస్తుండగా, అక్కడ ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. కొత్త నంబర్లు ఇవ్వడానికి అధికారులు సంశయిస్తున్నారు.

## కేసీఆర్‌ను కలిసిన సంపత్‌గౌడ్



బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్‌గౌడ్ కలిశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రానికి వెళ్లిన ఆయన గులాబీ దళపతిని కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని కేసీఆర్ సూచించారు.

– లింగంపేట, మే 2

## లబ్ధిదారుల వివరాలు సేకరించండి

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మోర్తాడ్, మే 2: ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారుల వివరాలు సేకరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలో లబ్ధిదారుల ఎంపిక, స్థలాల కేటాయింపుపై గందరగోళం నెలకొన్న తరుణంలో 'అనర్హులకే ఇందిరమ్మ ఇండ్లు' శీర్షికన నమస్తే తెలంగాణ గురువారం ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. పేదలకు కేటాయించిన స్థలాల్లో నర్సరీ ఏర్పాటు అంశాన్ని లేవనెత్తింది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. 1999లో ఇండ్ల స్థలాలు పొందిన లబ్ధిదారుల వివరాలు సేకరించాలని కార్యదర్శి సంధ్యకు సూచించారు. ప్రభుత్వ ఇండ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు కొంత మంది ఇండ్లు కట్టుకున్నారు. అయితే, అది కూడా కేటాయించిన ప్రకారం కాకుండా మరోలా నిర్మించుకున్నారు. మరోవైపు, ఇంకొందరు ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇండ్లు కట్టుకో పోవడంతో ఖాళీగా ఉన్న ఆ స్థలంలో నర్సరీని ఏర్పాటు చేశారు. దీన్ని నమస్తే తెలంగాణ ఎత్తిచూపగా అధికారులు స్పందించారు. మొదట లబ్ధిదారులను గుర్తించి, నర్సరీ ప్రాంతంలోని స్థలాన్ని వారికి కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే లబ్ధిదారుల వివరాలను సేకరించాలని కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చారు.





**రోడ్లే కల్లాలు..** ఉమ్మడి జిల్లాలో యాసంగి పంట కోతలు పూర్తి కావొచ్చాయి. ఎక్కడ చూసినా ధాన్యం రాశులే దర్శమిస్తున్నాయి. వడ్ల కుప్పలతో రహదారులు నిండిపోయాయి. పల్లెల్లో సరైన స్థలాలు లేక రోడ్లనే కల్లాలుగా మార్చుకున్నారు.బోధన్ మండలంలోని బోధన్–నాందేడ్ ప్రధాన రహదారికి రెండు వైపులా రైతులు పుట్ల కొద్దీ ధాన్యాన్ని ఆరబెట్టారు. కాంటాల్లో జాప్యం జరుగుతుండడంతో కుప్పలు చేసి ఉంచారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

## కానిస్టేబుల్ సస్పెన్షన్

- ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు వసూలు
- విచారణ చేపట్టి వేటు వేసిన సీపీ

రుద్రూర్, మే2: రుద్రూర్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న సిద్దిరామ్ చిన్నయ్యపై వేటు పడింది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ సాయి చైతన్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం తెంబుర్తి గ్రామానికి చెందిన రావుల నాగభూషణం అనే వ్యక్తికి ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానని అతడి నుంచి కానిస్టేబుల్ చిన్నయ్య రూ.2 లక్షలు తీసుకున్నాడు. రోజులు గడిచినా ఉద్యోగం ఇప్పించకపోవడంతో డబ్బులు ఇవ్వాలని నాగభూషణం అడుగగా తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సిద్దిరామ్ చిన్నయ్యపై నిజామాబాద్ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇదే తరహాలో నిర్మల్ , ఖానాపూర్ ప్రాంతాలకు చెందిన వారి నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి, వడ్డీల వ్యాపారం చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు విచారణ చేపట్టగా అవినీతి బాగోతం బయటపడడంతో సదరు కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు సీపీ ఒక ప్రకటనలో తెలిపారు.

## వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమాలు

కంఠేశ్వర్, మే 2: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. మండుటెండలతో జిల్లాలో ఎక్కడ కూడా ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా ప్రజల్లో అవగాహనను పెంపొందించాలన్నారు. వడదెబ్బ నివారణపై వైద్యారోగ్య శాఖతో పాటు ఇతర శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేలా తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో ఏం చేయాలి, ఏం చేయకూడదో తెలపాలని, ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయిన, ఈ క్రమంలో తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మధ్యాహ్న సమయంలో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని, ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తలకు ఎండ తగలకుండా టోపీ లేదా టవల్‌ను వినియోగించాలన్నారు. ఎండ సమయాల్లో సాధ్యమైనంత వరకు ప్రయాణాలు పెట్టుకోకూడదని, నీడ ప్రదేశాలలోనే ఉండాలని సూచించారు. ఎక్కువ మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోవడంతో పాటు తేలికపాటి కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు. త్వరగా వడదెబ్బకు లోనయ్యే స్వభావం కలిగిన వారు విధిగా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. వృద్ధులు, చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, సముదాయాలలో పని చేసే ఉద్యోగులు, కార్మికులు వడదెబ్బకు లోను కాకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధిహామీ కార్మికులు ఉదయం వేళలోనే పనులు చేసేలా, పని ప్రదేశాలలో తప్పనిసరిగా షామియానాలు, తాగునీటి వసతి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అన్ని దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీలలో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ నివారణ ఔషధాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.

## నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు!

- 'డయల్ 100'కు కాల్ చేసిన ఆగంతకుడు
- ఉరుకులు పరుగులు పెట్టిన పోలీసులు

వినాయక్‌నగర్, మే 2: నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టారంటూ ఓ గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి డయల్ 100కు కాల్ చేసి సమాచారమిచ్చాడు. దీంతో హైదరాబాద్ డయల్ 100 కంట్రోల్ రూం నుంచి నిజామాబాద్ వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతికి సమాచారం అందించారు. ఎస్‌హెచ్‌వో .. సీపీ సాయి చైతన్యకు సమాచారం అందించగా.. హుటాహుటిన ఏఆర్ హెడ్ క్వార్టర్ నుంచి బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతోపాటు ప్రత్యేక పోలీసు బలగాలతో రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. నిజామాబాద్ జీఆర్‌పీ, సీఐ, ఎస్సై, సిబ్బందితో కలిసి ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్లాట్‌ఫాం, పార్సిల్ గది, వెయిటింగ్‌హాల్‌తోపాటు బుకింగ్ కౌంటర్, రైల్వే ప్రాంగణంలో గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఎలాంటి బాంబు లభించకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. బాంబు పెట్టారంటూ వచ్చిన ఫోన్‌కాల్ నంబర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## డబ్బులిస్తేనే ఎంబీ చేస్తారట

- డీఈఈపై 'డబుల్' లబ్ధిదారుల ఆగ్రహం
- న్యాయం చేయాలని రాస్తారోకో
- పోలీసుల హామీతో ఆందోళన విరమణ



ఎల్లారెడ్డి – హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న సోమార్‌పేట్ డబుల్‌బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులు

ఎల్లారెడ్డి రూరల్, మే 2: డబుల్ బెడ్రూం ఇండ్ల బిల్లుల కోసం ఎంబీ చేయమంటే డబ్బులు అడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేట్ గ్రామానికి చెందిన లబ్ధిదారులు శుక్రవారం ఆందోళనకు దిగారు. పంచాయతీరాజ్ డీఈఈ గిరిధర్‌కు వ్యతిరేకంగా ఎల్లారెడ్డి–హైదరాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. తమకు న్యాయం చేసే వరకూ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. చివరకు పోలీసులు వచ్చి సర్దిచెప్పగా, వారు శాంతించారు. 2023లో సోమార్‌పేట్ గ్రామానికి పది డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరయ్యాయి. అయితే, అప్పటి పంచాయతీరాజ్ ఏఈ కృష్ణ నిర్లక్ష్యంతో వీటికి సంబంధించి ఆన్‌లైన్ పనులు కాలేదు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. దీంతో లబ్ధిదారులు స్థానిక నాయకులు, అధికారుల వెంటపడగా, చివరకు పనులు పునఃప్రారంభమయ్యాయి. రాజంపేట్ మండలానికి చెందిన కాంట్రాక్టర్ బంధం వేణు పేరిట డబుల్ బెడ్రూం ఇంటి పనులు మంజూరు కాగా, అగ్రిమెంట్ ప్రకారం లబ్ధిదారులు తమ సొంత డబ్బులతో ఇండ్లు నిర్మించుకున్నారు. గత మార్చి 19 నాటికి ఆన్‌లైన్ పనులు పూర్తయ్యాయి. అధికారులు ఎంబీ చేస్తే తమకు డబ్బులు తమకు వస్తాయని ఆశతో ఉన్న లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. ఎంబీ చేయాల్సిన అధికారులు చేయక పోగా, చుట్టూ తిరుగుతున్నా స్పందించడం లేదు. ఈ క్రమంలో స్థానిక నాయకుడు అంజాగౌడ్ శుక్రవారం డీఈఈ గిరిధర్‌ను అడిగితే దురుసుగా ప్రవర్తించారని, డబ్బులు అడిగారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే గతంలో బదిలీపై వెళ్లిన ఏఈ కృష్ణతో పాటు ప్రస్తుత ఏఈ పిచ్చయ్యకు, గిరిధర్‌కు కలిపి రూ.లక్షన్నర ఇచ్చామని లబ్ధిదారులు వాపోయారు. ఇంకా లక్షన్నర ఇస్తేనే ఎంబీ చేస్తానని డీఈఈ అంటున్నారని తెలిపారు. గిరిధర్ తీరును నిరసిస్తూ ఎల్లారెడ్డి–హైదరాబాద్ రహదారిపై బైఠాయించారు.

### బాకీలోళ్లు ఇంటి మీదికి అత్తుండ్రు..



ఎవరి ఇల్లు వాళ్లు కట్టుకోవాలంటే మా దగ్గిర డబ్బులు లేకున్నా బాకీలు తెచ్చి ఇల్లు కట్టుకున్నం. రెండేండ్లు అయింది. బాకీ ఇచ్చి నోళ్లు ఇండ్ల మీద పడి డబ్బుల కోసం గొడవ చేస్తుండ్రు. సారు ఎంబీ చేస్తే కాంట్రాక్టర్ ఖాతాల పైసలు పడతయి, కాంట్రాక్టరు మాకు వెంటనే ఇచ్చేస్తానన్నడు. కానీ ఈడ సారు డబ్బులిస్తేనే ఎంబీ చేస్త అంటుండు. మాకు న్యాయం చేయాలి.

**- చింతకాయల భాగ్య, లబ్ధిదారు**

### ఇల్లు ఖాళీ చేయమంటున్నరు..



ఇండ్లు కట్టుకోవడానికి మాకు బాకీ ఇచ్చినోళ్ళు డబ్బులు ఇస్తరా.. ఇండ్లు ఖాళీ చేస్తరా? అని గొడవ చేస్తున్నరు. మేము ఇండ్లు ఖాళీ చేస్తే వాళ్లు వచ్చి ఉంటరట. సారేమో ఎంబీ చేస్తలేడు. ఆఫీసు చుట్టూ తిప్పుకుంటున్నడు. ఎంబీ చేసే దాకా రోడ్డుపైననే కూసుంటం. ఒకయాళ్ల ఇప్పుడు రోడ్డు పైనుంచి లేపేసినా, మాకు న్యాయం జరిగేదాకా రోజూ వచ్చి రోడ్డు మీదనే కూసుంటం.

**- క్యాస లక్ష్మి, లబ్ధిదారు**

### తప్పుడు ఆరోపణలు

పనులు చేయడానికి డబ్బులు అడిగామన్నది, వాళ్లు ఇచ్చామన్నది అంతా అబద్ధమే. నామీద నిరాధార ఆరోపణలు చేస్తున్నరు. నేను ఎవరినీ డబ్బులు అడగలేదు. నాకు ఎవరూ ఇవ్వలేదు. ఇస్తే వారి దగ్గర ఏదైనా ఆధారముంటే చూయించమనండి. నా పని నేను చేస్తా తప్ప ఎవరినీ ఇబ్బంది పెట్టను

**- గిరిధర్, పంచాయతీరాజ్ డీఈఈ**

## పరీక్ష రాసి వస్తుండగా ప్రమాదం అక్కాచెల్లెలు మృతి

- కల్వర్టును ఢీకొన్న కారు.. ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాత
- జక్రాన్‌పల్లి మండల అర్గుల్ శివారులో ఘటన
- మృతుల స్వస్థలం నిర్మల్ జిల్లా పెంబి మండల లోతర్య తండా

జక్రాన్‌పల్లి, మే 2 : ఎంసెట్ రాసి తిరిగి కారులో వస్తుండగా జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కాచెల్లెలు మృత్యువాత పడ్డారు. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. మృతులు నిర్మల్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. జక్రాన్‌పల్లి ఎస్సై రహమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని లోతర్య తండాకు చెందిన బానోవత్ అశ్విని (19), బానోవత్ మంజుల(17) అక్కచెల్లెళ్లు. వీరు హైదరాబాద్‌లో ఎంసెట్ రాయడానికి కారులో వెళ్లారు. పరీక్ష రాసి తిరిగి కారులో వస్తుండగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులో జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశ్విని, మంజుల ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. డ్రైవర్ జాదవర్ హంసరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంవల్లే కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైనట్లు పేర్కొన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జక్రాన్‌పల్లి ఎస్సై